క్లుప్తంగా

సాక్షి డైరెక్టర్ పీవీకే ప్రసాద్‌కు పితృవియోగం



మాధవరావు(ఫైల్)

మంగళగిరి: సాక్షి దినపత్రిక డైరెక్టర్ పీవీకే ప్రసాద్ తండ్రి పాలడుగు మాధవరావు(92) శుక్రవారం సాయంత్రం కన్నుమూశారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గుంటూరు జిల్లా మంగళగిరిలోని కొండపనేని టౌన్‌షిప్‌లోగల కుమారుని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఈయన స్వగ్రామం కృష్ణాజిల్లా ముస్తాబాద. పశ్చిమగోదావరి జిల్లా కో–ఆపరేటివ్ బ్యాంకులో కార్యదర్శిగా పని చేసి ఉద్యోగ విరమణ చేశారు. మాధవరావు భార్య హైమావతి 2019లో కాలం చేశారు. ఆయనకు ఓ కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. శనివారం మంగళగిరిలో పాలడుగు అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

రాష్ట్ర స్థాయి కవితల పోటీకి ఆహ్వానం

భవానీపురం(విజయవాడపశ్చిమ):స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ కవితా వేదిక, సంస్కార భారతి సంయుక్త నిర్వహణలో రాష్ట్ర స్థాయి కవితల పోటీకి విద్యార్థులను ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకులు జింకా చక్రధర్, రామ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. స్వాతంత్ర్య పోరాటంలో యువత పాత్ర అనే అంశంపై ఈ పోటీ ఉంటుందని, రచన పూర్తిగా సకారాత్మకంగా ఉండాలని పేర్కొన్నారు. పోటీదారులు ఆంధ్రప్రదేశ్ నివాసితులై ప్రస్తుతం జూనియర్/డిగ్రీ/డిప్లొమో/యూనివర్శిటీ విద్యార్థులై ఉండాలని తెలిపారు. రచన 20 వరుసలకు మించ రాదని, ఎక్కడా ప్రచురణ కాని సొంత రచనై ఉండాలన్నారు. ఒకరు ఒక కవిత మాత్రమే పంపాలని, కవితతోపాటు పేరు, సెల్ నెంబర్, కాలేజి పేరు, ఊరు పేరు 9246471593, 9848035573 వాట్సాప్ నంబర్లకు పంపాలని కోరారు. ఎంపికైన కవితలను ఈ నెల 13న వర్చువల్‌గా జరిగే సమావేశంలో స్వయంగా చదివే అవకాశాన్ని కలిప్తామని తెలిపారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు ప్రోత్సాహక బహుమతులు కూడా ఉంటాయని పేర్కొన్నారు. కవితలను ఈ నెల 10వ తేదీలోగా పంపాలని సూచించారు.

అలరించిన భక్తి రంజని



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం కళావేదికపై విజయవాడకు చెందిన శ్రేష్ఠ అకాడమీకి చెందిన పలువురు ఆలపించిన భక్తి గేయాలు భక్తులను అలరించాయి. ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై భక్తిగేయాలను ఆలపించారు. అకాడమీకి చెందిన లక్ష్మీ సుందరి, శైలజ వైష్ణవి, జ్యోతి, దీపిక, శేష కుమారి పలు గేయాలను ఆలపించారు. అనంతరం వారికి అమ్మవారి దర్శనం కల్పించిన అధికారులు ప్రసాదాలు అందచేశారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):కుటుంబ కలహాల నేపథ్యంలో యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. భీమన వారిపేటకు చెందిన బయవరపు రవి కుమార్ పూల మార్కెట్‌లో పని చేస్తుంటాడు. రవికుమార్‌తో పాటు అతని సోదరుడు రాజ్‌కుమార్ , తల్లి ఒకే పోర్షన్‌లో ఉంటారు. రవికుమార్‌కు వివాహం కాగా మద్యం తాగడం వల్ల భార్యాభర్తలకు గొడవలు జరుగుతున్నాయి. దీంతో రవికుమార్ భార్య నూజివీడులోని పుట్టింటికి వెళ్లిపోయింది. భార్యను ఎన్ని సార్లు కాపురానికి రావాలని అడిగినా ప్రయోజనం లేకుండా పోయింది. గురువారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చిన రవికుమార్ తన గదిలోకి వెళ్లి పడుకున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున నిద్రలేచిన రాజ్‌కుమార్ తన అన్న గదిలో చూసే సరికి ఫ్యాన్‌రాడ్‌కు కండువాతో ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. దీంతో కంగారు పడిన రాజ్‌కుమార్ చుట్టు పక్కల వారిని పిలిచి ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించాడు. అయితే అప్పటికే రవికుమార్ ప్రాణాలు పోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు.

రైలు కింద తలపెట్టి యువకుడి ఆత్మహత్య

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): గుర్తు తెలియని రైలు కింద తలపెట్టి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై జీఆర్‌పీ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్లాట్‌ఫామ్ బర్ వన్‌లోని దక్షిణం వైపు గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని గుర్తించిన సిబ్బంది స్టేషన్ సూపరింటెండెంట్‌కు సమాచారం ఇచ్చాడు. దీంతో ఆయన జీఆర్‌పీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటన స్థలానికి చేరుకున్న జీఆర్‌పీ ఎస్‌ఐ భాస్కర్ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి వయస్సు సుమారు 20–25 మధ్య ఉంటుందని తెలిపారు. తల మొండెం వేరుఅయ్యి ఉండటంతో కదులుతున్న రైలు కింద తలపెట్టి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

విజయవంతంగా జగనన్న సురక్ష

- ప్రతి కుటుంబానికీ పలకరింపు
- పశ్చిమంలో 90,261 కుటుంబాలు
- నియోజకవర్గంలో 31 వేల పత్రాలు జారీ చేసిన అధికారులు
- అవసరమైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సేవలు
- 19 ప్రభుత్వ శాఖల పరిధిలో పూర్తిగా ఉచితం
- నెల రోజుల పాటు ప్రతిష్టాత్మకంగా నిర్వహణ



పశ్చిమంలో జగనన్న సురక్షలో భాగంగా ధృవపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి (ఫైల్)

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలో నెల రోజుల పాటు ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతమైంది. ప్రతి కుటుంబాన్నీ ప్రజాప్రతినిధులు, అధికారులు పలకరించారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. కొన్నింటికి అక్కడికక్కడే పరిష్కారం చూపించారు. అవసరమైన ప్రభుత్వ సేవలేమిటో తెలుసుకొని అందుకు అవసరమైన సర్టిఫికెట్లు ఉచితంగా అందజేశారు. 19 ప్రభుత్వ శాఖల పరిధిలో సేవలను నిర్దేశించిన రుసుములేవీ చెల్లించనవసరం లేకుండానే పూర్తి ఉచితంగా అందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనకు ప్రజలు జేజేలు పలుకుతున్నారు.

జూలై మాసం అంతా శిబిరాలు...

నియోజకవర్గంలో ప్రజల సమస్యలకు నాణ్యమైన పరిష్కారాన్ని సత్వరమే అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం గత జూలై మొదటి తేదీన లాంఛనంగా ప్రారంభించింది. సుమారు నెల రోజుల పాటు విజయవంతంగా సచివాలయ పరిధుల్లో శిబిరాలను నిర్వహించారు. క్షేత్ర స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ వివిధ దశల్లో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరాలు సత్ఫలితాలను ఇచ్చాయి.

ఎటువంటి ఖర్చు లేకుండా...

సమగ్ర కుల ధ్రువీకరణపత్రం, ఓబీసీ, ఆదాయ ధ్రువీకరణ పత్రం, వివాహ ధ్రువీకరణపత్రం, ఆర్ ఓఆర్ 1బి, కంప్యూటరైజ్డ్ అడంగల్, మ్యుటేషన్ టైటిల్ డీడ్, ముద్రించిన కాపీ జారీ, కొత్తగా వివాహమైనవారికి రేషన్‌కార్డులో విభజన, ఇంటిస్థల పట్టా జారీ, ఆధార్ లింకేజీ ఇలా పలు సేవలను ప్రభుత్వం ఉచితంగా అందించింది.

ప్రతి కుటుంబానికి ప్రయోజనం

పశ్చిమ నియోజకవర్గంలో 90 వార్డు సచివాయాలు ఉన్నాయి. వాటి పరిధిలోని నివాస గృహాలను ఒక షెడ్యూల్ ప్రకారం అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సందర్శించారు. ప్రత్యేక సర్వే నిర్వహించారు. 19 ప్రభుత్వ శాఖల పరిధిలోని వివిధ సేవలకు సంబంధించిన వినతులను ప్రజల నుంచి సేకరించారు. వాటికి సంబంధించిన ప్రత్యేక యాప్‌లో నమోదు చేసి వారికి టోకెన్లు అందించారు.

ఆయా వినతులను పరిశీలించిన తరువాత అర్హులైన వారికి పూర్తి ఉచితంగా సేవలు అందించారు. వివిధ సర్టిఫికెట్లను ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ప్రజలకు అందించారు.

ప్రణాళిక ప్రకారం...

నియోజకవర్గంలో 90 సచివాలయాల పరిధుల్లో 1052 మంది వలంటీర్లు పని చేస్తున్నారు. సుమారు 90261 కుటుంబాలు నివసిస్తున్నాయి. 84,957 కుటుంబాలను వలంటీర్లు ఇతర సిబ్బంది సర్వే చేశారు. 32,236 కుటుంబాలు వినతిపత్రాలు అందించారు. అందులో 31,001 వినతులను పరిష్కరించి అవసరమైన పత్రాలను అందించారు. 725 వినతులు పెండింగ్‌లో ఉండగా, 510 వినతులను సరైన ఆధారాలు లేని కారణంగా వాటిని తిరస్కరించారు. నగరపాలకసంస్థ, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపులు, ఆధార్, పౌరసరఫరాలు, గ్రామ సచివాలయాలు, గ్రామీణాభివృద్ధి, కార్మిక, వైద్య, ఆరోగ్యం, పోలీసు, విద్యుత్, దేవదాయ, వక్ఫ్, ఫ్యాక్టరీలు, భాషా సాంస్కృతిక తదితర శాఖల పరిధిలో అందించిన వినతులకు సంబంధించి అర్జీలు పరిష్కారం చేసి ధ్రువీకరణ పత్రాలను అందించారు.

ఆధార్ కార్డులో ఫోన్ నెంబర్ అప్‌డేట్	1,729
ఆదాయ ధ్రువీకరణ పత్రాలు	13,069
ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్	15,967
ఓబీసీ సర్టిఫికెట్లు	06
పింఛను మంజూరు	06
కొత్త బియ్యం కార్డులు	53
బియ్యం కార్డులో పేరు జత చేయటం	46
బియ్యం కార్డులో పేర్లు తొలగింపు	05
బియ్యం కార్డుల చిరునామా మార్పు	01
బియ్యం కార్డుల మార్పు	23
కొత్త ఆరోగ్యశ్రీ కార్డులు	10
ఆరోగ్యశ్రీ కార్డులు అప్‌డేట్	01
బర్త్ సర్టిఫికెట్లు	03
కంప్యూటరైజ్డ్ అడంగల్ సర్టిఫికెట్లు	03
వివాహ ధృవపత్రాలు	01

సమస్యలకు తక్షణ పరిష్కారం



ప్రజలకు సంబంధించిన వివిధ సమస్యల పరిష్కారానికి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించింది. నియోజకవర్గంలో నెలరోజుల పాటు నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరాల ద్వారా ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించింది. ఈ కార్యక్రమం అనుకున్న దాని కన్నా విజయవంతమైంది. ప్రజల మన్ననలు పొందింది. సుమారు 31 వేల పత్రాలను జారీ చేయటం ఆనందంగా ఉంది.

–వెలంపల్లి శ్రీనివాసరావు, శాసనసభ్యులు

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

పటమట(విజయవాడతూర్పు):నగరంలోని సెంట్రల్, పశ్చిమ నియోజకవర్గాల్లో పలు డివిజన్‌లలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన, పూర్తయిన పనులను ప్రారంభోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ స్వప్నిల్ దినకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెంట్రల్ నియోజకవర్గంలోని 25వ డివిజన్ చపర్లవారి వీధి సీతారాంపురం వద్ద కార్పొరేషన్ సాధారణ నిధులు రూ. 13.80 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, బనవోలు వీధి రూ. 16.36 లక్షలతో నిర్మించిన సీసీరోడ్డు, కొత్త వంతెన నుంచి ఏలూరు రోడ్ అంజనేయ స్వామి టెంపుల్ వరకు రూ. 15.21 లక్షలతో నిర్మించిన బీటి రోడ్, అరండల్ పేట లోని మూర్తి స్ట్రీట్‌లో రూ. 16.00 లక్షలతో, గారపాటి వారి వీధిలో రూ. 15.80 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 50 వ డివిజన్ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 44.30 లక్షలతో నిర్మించనున్న నూతన తాగునీటి పైప్‌లైన్ పనులు, గొల్లపాలెం గట్టు కొండ ప్రాంతంలో రూ.55.77 లక్షలతో నిర్మించనున్న నాలుగు రిటైనింగ్ వాల్స్ శంకుస్థాపన చేస్తామని పేర్కొన్నారు. ఆయా కార్యాక్రమాల్లో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, పశ్చిమ ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్, డెప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు పాల్గొంటారని తెలిపారు.

ఉద్యోగోన్నతి రేసులో ఏడీసీపీ వెంకటరత్నం

విజయవాడ స్పోర్ట్స్:రాష్ట్ర హోం శాఖ శుక్రవారం విడుదల చేసిన సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ) ఉద్యోగోన్నతి ప్యానల్ లిస్టులో ఏడీసీపీ పి.వెంకటరత్నం చోటు దక్కించుకున్నారు. ఏఎస్పీ కేడర్‌లో ప్రస్తుతం ఆమె జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో క్రైం అడిషనల్ డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏడీసీపీ)గా పని చేస్తున్నారు. తాజాగా విడుదలైన ప్యానల్ లిస్టులో పేరు ఖరారు చేయడంతో త్వరలో ఆమెకు ఎస్పీగా ఉద్యోగోన్నతి దక్కనుంది.





ఆత్మీయ స్వాగతం

విజయవాడలో శుక్రవారం నిర్వహించిన ఆప్కాబ్ వజ్రోత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకుతున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి. సీఎం వైఎస్ జగన్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏపీఐడీసీ చైర్మన్ పుణ్యశీల.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

రెచ్చగొట్టే ప్రసంగాలతో గొడవలకు ఉసిగొల్పుతున్నాడు

వైఎస్సార్ సీపీ నాయకుడు ఆకుల

భవానీపురం(విజయవాడపశ్చిమ): అన్నమయ్య జిల్లా పుంగనూరు, తంబళ్లపల్లి ప్రాంతాల పర్యటనలో రెచ్చగొట్టే ప్రసంగాలు చేసి వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై టీడీపీ నాయకులు, కార్యకర్తలను ఉసి గొల్పుతున్న చంద్రబాబు తీరును చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత రెండు రోజులుగా రాయలసీమ జిల్లాల్లో చేస్తున్న పర్యటనలకు ప్రజల నుంచి స్పందన రాకపోవడంతో ఇక్కడ రెచ్చగొట్టి గొడవలు సృష్టిస్తున్నాడని మండిపడ్డారు. టీడీపీ నాయకులు తమ వాహనాల్లో తుపాకులు, గుళ్లు పెట్టుకుని తిరగటమే అందుకు నిదర్శమన్నారు. టీడీపీ నాయకులు ఎవర్ని చంపుదామని కార్లలో తుపాకులు పెట్టుకుని తిరుగుతున్నారని ప్రశ్నించారు.

తన చుట్టూ బ్లాక్ క్యాట్ కమాండోలు, వందల సంఖ్యలో స్థానిక పోలీసులను రక్షణగా పెట్టుకుని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని పట్టుకుని నీకు దమ్ముంటే ఒక్కడివే రా చూసుకుందాం అనటం హాస్యాస్పదంగా ఉందని తెలిపారు. పేద, బడుగు, బలహీనవర్గాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్కచెల్లెమ్మలకు సుమారు 50 వేల ఇళ్లు ఇస్తుంటే, అమరావతి రైతుల ముసుగులో టీడీపీ నాయకులతో కోర్టులో కేసులు వేయించి అడ్డుకుంటున్న చంద్రబాబుకు మహిళల ఉసురు తగులుతుందని తెలిపారు. ఆ విషయాన్ని పక్కదారి పట్టించేందుకు జిల్లాల పర్యటనల పేరుతో ప్రజల్ని రెచ్చగొడుతున్నాడని ధ్వజమెత్తారు. చంద్రబాబు కుళ్లు, కుట్ర రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని, భవిష్యత్‌లో శాశ్వతంగా రాజకీయ సమాధి చేస్తారని హెచ్చరించారు.

వాసవి క్లబ్ లోటస్ సేవలు అభినందనీయం



వృద్ధాశ్రమంలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న బ్రహ్మనందం, సభ్యులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): వృద్ధులు, పేదలు, విద్యార్థులకు వాసవి క్లబ్ విజయవాడ లోటస్ అండ్ లోటస్ యూత్ క్లబ్ సభ్యులు అందిస్తున్న సేవలు అభినందనీయమని సంస్థ ప్రాంతీయ అధికారి తడికమళ్ల బ్రహ్మనందం అన్నారు. పర్యటనలో భాగంగా శుక్రవారం ఆయన వినాయకుని గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పేదలకు గొడుగులు, సీఏ చదువుతున్న పేద విద్యార్థికి ఆర్థిక సహాయం అందచేశారు. భవానీపురంలోని వెంకట సాయి వృద్ధుల ఆశ్రమంలో మహిళలకు చీరలు పంపిణీ చేసి అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా బ్రహ్మనందం మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడంలో, పేదలకు సేవలందించటంలో ఆర్యవైశ్యులు ప్రతీకగా నిలుస్తారని తెలిపారు. కేవలం క్లబ్ అధికారుల పర్యటనల సందర్భంలోనే కాకుండా ఇబ్బందుల్లో ఉన్న పేదవారిని గుర్తించి మరీ అన్ని విధాల సహాయం అందించటంలో వాసవి క్లబ్ విజయవాడ లోటస్, యూత్ క్లబ్ సభ్యులు ముందుంటారని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు అప్పన వెంకట మధురవాణి, కార్యదర్శి వనమా కనకరత్నం, కోశాధికారి వాకచర్ల చంద్రిక, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

దోపిడీ, హత్యాయత్నం కేసులో ఇద్దరికి ఏడేళ్ల జైలు

విజయవాడస్పోర్ట్స్: ఓ వ్యక్తిని బెదిరించి దోపిడీ చేసి, అతన్ని హత్య చేసేందుకు ప్రయత్నించిన ఇద్దరు నిందితులకు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ విజయవాడ ఏడవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎస్.నాగేశ్వరరావు శుక్రవారం తీర్పు చెప్పారు. గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన ఓ వ్యక్తి పెయింటింగ్ పనులు చేసి జీవనం సాగించేవాడు. పెయింటింగ్ సామగ్రి కొనుగోలు చేసేందుకు 2021 నవంబర్ ఆరో తేదీన విజయవాడ వన్‌టౌన్‌లోని గద్దబొమ్మ సెంటర్‌కు వచ్చాడు. అదే సమయంలో విజయవాడ గొల్లపాలెం గట్టు ప్రాంతానికి చెందిన గంజిరిబోయిన ప్రసాద్, కొరపాటి నాగేశ్వరరావు అక్కడకు వచ్చి పెయింటర్‌ను డబ్బులు ఇవ్వమని బెదిరించగా, అతడు అందుకు నిరాకరించడంతో అతని రెండు చేతులను వెనక్కి విరిచి కత్తితో దాడి చేశారు. ఈ ఘటనలో పెయింటర్‌కు ఛాతీపై తీవ్ర గాయాలయ్యాయి. దీనిపై కేసు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.జేమ్స్ న్యాయస్థానానికి వాదనలు వినిపించారు. 11 మంది సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితులు గంజరిబోయిన ప్రసాద్, కొరపాటి నాగేశ్వరరావులకు జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించారు.

ఆవిష్కరణలపై పట్టు సాధించాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):విద్యార్థులు ఆవిష్కరణలపై పట్టు సాధించాలని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి పి.లక్ష్మణస్వామి తెలిపారు. ఆ కళాశాల ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఎనలాగ్ ఐసీ అప్లికేషన్స్ అంశంపై శుక్రవారం వర్క్‌షాప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన లక్ష్మణస్వామి మాట్లాడుతూ నూతన సాంకేతిక విప్లవం నేపథ్యంలో అన్ని రంగాల్లోనూ విస్తృతమైన ప్రగతి చోటు చేసుకుంటుందని తెలిపారు. విద్యార్థులు తమతమ రంగాలకు సంబంధించి వస్తున్న ఆవిష్కరణలను తెలుసుకొని వాటిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ముఖ్యవక్తగా హాజరైన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఎస్.ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ ఇంటగ్రేటెడ్ సర్క్యూట్స్ ఉపయోగాలు, వాటిని వినియోగించి తయారు చేసే నమూనాల గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఎ. పతాంజలిశాస్త్రి, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎ.రవి, కోఆర్డినేటర్ కె.సుందర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గణపతికి విశేష అభిషేకాలు, హోమాలు





గణపతికి పంచామృతాలతో అభిషేకాలు : హోమంలో పాల్గొన్న ఈవో భ్రమరాంబ, ఉభయదాతలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):సంకట హర చతుర్థిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై గణపతి స్వామికి శుక్రవారం విశేష అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి స్వామి వారి మందిరం వద్ద యాగశాలలో స్వామి వారికి పంచామృత అభిషేకాలు చేశారు. తొలుత స్వామి వారి విగ్రహం వద్ద కలశ స్థాపన జరిగింది. అనంతరం స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు, గరికెతో విశేష అలంకరణ, అర్చనలు నిర్వహించారు. యాగశాలలో గణపతి మంత్ర హవనం (హోమం) వైభవంగా నిర్వహించారు. ఆలయ స్థానాచార్య విష్ణుభట్ల శివ ప్రసాద్ శర్మ పర్యవేక్షణలో వైదిక కమిటీ సభ్యులు శంకరశాండిల్య, మురళీ, ఇతర అర్చకులు హోమం జరిపించారు. ఈవో భ్రమరాంబ, పలువురు ఉభయదాతలు పాల్గొనగా, వేద ఆశీర్వచనం జరిగింది. అనంతరం భక్తులకు స్వామి వారి ప్రసాదాలను పంపిణీ చేశారు.

మాతృభాషా ప్రేమికుడు మండలి



డాక్టర్ సమరానికి పురస్కారం ప్రదానం చేస్తున్న మండలి బుద్ధ ప్రసాద్, లక్ష్మీకాంతం, సుబ్బారావు

విజయవాడ కల్చరల్: మాతృభాషా ప్రేమికుడు మండలి వెంకట కృష్ణారావు అని పూర్వపు కలెక్టర్ డాక్టర్ బి.లక్ష్మీకాంతం అన్నారు. కృష్ణా జిల్లా రచయితల సంఘం, మండలి ఫౌండేషన్, జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో బందరు రోడ్డు బాలోత్సవ్ భవన్‌లో శుక్రవారం సభ నిర్వహించారు. మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు 98 జయంతి ఉత్సవం, ప్రముఖ వైద్యుడు డాక్టర్ సమరానికి మండలి వెంకట కృష్ణారావు స్మారక పురస్కార సభలో లక్ష్మీకాంత్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలతో మమేకమై పనిచేసిన నేత మండలి అని కొనియాడారు. దివిసీమ ఉప్పెన సమయంలో ఆయన చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. పోలవరపు సాహితీ సమితి వ్యవస్థాపకుడు గోళ్ళ నారాయణరావు మాట్లాడుతూ తొలి తెలుగు ప్రపంచ మహాసభలను హైదరాబాద్‌లో విజయవంతగా నిర్వహించారని తెలిపారు. తెలుగు భాషాభివృద్ధికి అనేక ప్రణాళికలు రూపొందించినట్లు గుర్తుచేశారు. మండలి పురస్కారం అందుకుంటున్న ప్రఖ్యాత వైద్యులు డాక్టర్ సమరం సామాజిక సేవలను వివరించారు. డాక్టర్ గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ మండలి వెంక కృష్ణారావు స్ఫూర్తితో ఆంధ్ర సారస్వత పరిషత్ ద్వారా భీమవరంలో తెలుగు మహాసభలు నిర్వహించినట్లు తెలిపారు. గజల్ సాహిత్యం గురించి మాట్లాడుతూ గజల్ అంటే ప్రేమతో పలకరిచడం అన్నారు. గానంతో ఆత్మీయంగా ఆలింగనంచేసుకోవడమని తెలిపారు. ముకుంద శర్మ రచించిన గజల్‌ను గానం చేశారు. నిర్వాహకులు డాక్టర్ సమరానికి 2023 సంవత్సరానికి గానూ మండలి వెంకట కృష్ణారావు స్మారక పురస్కారాన్ని అందించారు. ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్, కృష్ణా జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచంద్, సాహితీవేత్తలు డాక్టర్ గుమ్మా సాంబశివరావు పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్):ద్విచక్ర వాహనదారులు రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ ధరించకపోవడంతోనే ఎక్కువగా ప్రాణాలు కోల్పోతున్నారని ఎస్ఎన్‌పురం ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటనారాయణ తెలిపారు. నగర పోలీస్ కమిషనర్ టీకే రాణా ఉత్తర్వుల ప్రకారం డీసీపీ విశాల్‌గున్ని, ఏసీపీ రవికాంత్ ఆదేశాలతో హెల్మెట్ వాడకంపై అలంకార్ సెంటర్‌లో శుక్రవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు.

నేడు సంగీతంపై వర్క్ షాప్

విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ, సృజనాత్మక సమితి ఆధ్వర్యంలో కర్నాటక సంగీతంపై శనివారం వర్క్‌షాప్ నిర్వహిస్తునట్లు సృజనాత్మక సమితి సీఈవో ఎల్.మల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంగీత కళాశాలలో శనివారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో ప్రఖ్యాత విదుషీమణి హైదరాబాద్ సిస్టర్స్‌లో ఒకరైన హరిప్రియ ప్రసంగిస్తారని చెప్పారు. సంగీత అభిమానులు ఈ అవకాశం వినియోగించుకోవాలని కోరారు.

భార్య, కుమార్తె అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):తన భార్య , కుమార్తె కనిపించడం లేదనే ఫిర్యాదుతో కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. గంగానమ్మ గుడి ప్రాంతానికి చెందిన కోయ్య మణికంఠ, తేజస్విని భార్యాభర్తలు. వీరికి రెండేళ్ల కుమార్తె ఉంది. మణికంఠ గతంలో విజయవాడలో రియల్ ఎస్టేట్‌లో పని చేసేవాడు. వచ్చే జీతం సరిపోకపోవడంతో కొద్ది నెలల కిందట హైదరాబాద్‌లో ఉద్యోగం చేయసాగాడు. ఆగస్టు 1వ తేజస్విని భర్తకు ఫోన్ చేసి చేతికి ఉన్న పచ్చబొట్టు తీయించుకునేందుకు హాస్పటల్‌కు వెళతానని చెప్పింది. అదే రోజు సాయంత్రం నుంచి తేజస్విని ఫోన్ పని చేయకపోవడంతో ఆందోళన చెందిన మణికంఠ విజయవాడ వచ్చి ఇంట్లో చూసే సరికి భార్య, కుమార్తె కనిపించలేదు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నేడు నగరంలో శాంతిర్యాలీ

లబ్బీపేట(విజయవాడతూర్పు):మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ చర్చెస్ ఆధ్వర్యంలో శనివారం శాంతిర్యాలీ నిర్వహిస్తున్నట్లు విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, మోన్సిన్యోర్ మువ్వల ప్రసాద్, సీయస్ఐ కృష్ణా గోదావరి డయాసిస్ బిషప్ జార్జి కొర్నేలియస్ శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని బిషప్ అజరయ్య పాఠశాల నుంచి సాయంత్రం 4 గంటలకు ఈ శాంతి ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు. నగరంలోని అన్ని క్రైస్తవ సంఘాలు ఈ ర్యాలీలో పాల్గొని మణిపూర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొల్పేందుకు కేంద్ర, అక్కడి రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో జరుగుతున్న అనాగరిక చర్యలను మానవతావాదులందరూ తీవ్రంగా ఖండించాలన్నారు. మతం మానవత్వం వైపు నడిపించాలే తప్ప, మతోన్మాదం వైపు నడిపించకూడదని తెలిపారు. ఈ ర్యాలీ బిషప్ అజరయ్య స్కూల్ గ్రౌండ్ నుంచి శిఖామణిసెంటర్, రెడ్‌సర్కిల్, సీఎస్ఐ సెయింట్ పాల్స్ బసిలిక చర్చి వరకూ ర్యాలీ కొనసాగుతుందని తెలిపారు. ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో క్రైస్తవులు పాల్గొని బిషప్‌లు జోసఫ్ రాజారావు, జార్జి కొర్నేలియస్‌లు పిలుపునిచ్చారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):బడి ఈడు పిల్లలు అందరూ బడిలోనే ఉండాలని డీఆర్‌ఓ మోహన్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుకతో కలిసి ఎంఈవోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరంలో బడి బయట ఉన్న 6 నుంచి 16 సంవత్సరాల వయస్సు కలిగిన విద్యార్థులను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు.